అర్జునరావు, వెంకటనారాయణ ఒక తల్లి బిడ్డలే అయినప్పటికీ, ఇద్దరికీ ఉత్తర, దక్షిణ ధృవాలకున్నంత తేడా వుంది. ఆ తేడా చిన్నతనంనుంచి వుంది. అర్జునరావు అయిదో క్లాసువరకు చదువుకున్నాడు. అంతవరకైనా ఎనిమిదేళ్ళు పట్టింది. చిన్నప్పట్నుంచే 'ఈజీ లైఫ్'కు అలవాటుపడ్డాడు. రోజూ స్కూలుకు వెళ్లేవాడు కాదు. కానీ, అర్ధణా పెట్టి గోలీలు ఆడేవాడు. గెల్చిన డబ్బుతో మిఠాయి కొట్లో తాను తిని, తన ఫ్రెండ్స్‌కు పెట్టించేవాడు. కరణంగారి పెరట్లో జామకాయలు కోసేవాడు. ఇంట్లో అణా, బేడా కనబడితే వెంటనే జేబులో పెట్టుకొనేవాడు. అకతాయి వెధవగా ఊళ్ళో చెడ్డపేరు తెచ్చుకున్నాడు. తల్లిదండ్రులు నయానా భయానా చెప్పి కొసకు గాలికి వొదిలేశారు. దాంతో అర్జునరావు జీవన సరళి క్రమశిక్షణ లేకుండా పోయింది- తెగిన గాలిపటంలాగా. ఏదో యేటనుంచే జూదరి మనస్తత్వం అలవడింది. పదకొండేళ్లు వచ్చినదగ్గర్నుంచీ గుళ్ళో తన కంటె పెద్దవాళ్ళతో అయిదూ, పదిపైసలు రమ్మీ ఆట ఆడుతూవుండేవాడు. ఇరవైయ్యేళ్ళ వయస్సు వొచ్చేసరికి ఇతర్లను దోచుకోవడంవల్ల శ్రమలేకుండా, సునాయాసంగా, సుఖంగా బ్రతకొచ్చని నేర్చుకున్నాడు. జీవితమార్గాన్ని ఆ విధంగా మల్చుకున్నాడు. టవున్‌కెళ్ళి క్లబ్బుల్లో పేకాట మొదలెట్టాడు. పేకాట లక్ష్మి అతగాడ్ని వరించింది. ఎంత స్టేక్ ఆడితే బ్యాంకూ, రెండు బ్యాంకులు గెల్చేవాడు. వయస్సు పెరుగుతూన్నకొద్దీ దురలవాట్ల స్నేహం జాస్తి అయింది. బ్రాందీ విస్కీలు, పరాయిస్త్రీల సాంగత్యం ఐహికసుఖాలకు సోపానాలైనాయి.

వెంకటనారాయణ అట్లా కాదు. చిన్నప్పట్నుంచీ "తల్లి నిన్ను దలంచి" అన్నట్లు సత్ప్రవృత్తిప్రసన్నుడై చదువుధ్యాసలో పడ్డాడు. ప్రతి క్లాసులోనూ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడవుతూ, బి.ఏ పూర్తిచేశాడు. బి.ఇడి చదివాడు. జిల్లా పరిషత్ స్కూలులో ఉద్యోగం వచ్చింది. మూడేళ్ళు కొంచెం దూరంగా పని చేసి, సొంతవూర్లోనే హైస్కూలులో సోషల్‌స్టడీస్ టీచరుగా బదిలీ చేయించుకున్నాడు. మొదట్నుంచీ వెంకటనారాయణ తన జీవితాన్ని కొన్ని సూత్రాలతో బంధించి, జీవితపథాన్ని తీర్చిదిద్దుకున్నాడు. తల్లిదండ్రుల్ని గౌరవించాలి. శ్రమ చేసి జీవించాలి. ఇతర్ల సొమ్ముకు ఆశపడరాదు. ఎవర్నీ మోసం చేయరాదు.

ఖతవ్యయం చేయాలి. అబద్ధమాడరాదు. భగవంతుడు తనకిచ్చినదాంతోనే తృప్తి పడాలి గానీ, ఆకాశానికి ఆశల నిచ్చెల్ని వేసుకొంటూ పోరాదు.

అన్నదమ్ములిద్దరికీ పెళ్ళి అయింది.

వెంకటనారాయణ తాతలుకట్టించిన ఇంట్లోనే వుంటున్నాడు. తల్లిదండ్రులు అతనిదగ్గరే వుంటున్నారు.

అర్జునరావు టపున్లో స్థిరపడిపోయాడు. రెండున్నరలక్షలు పెట్టి పెద్ద మేడ కట్టాడు.

వెంకటనారాయణకు స్కూల్లో ఉద్యోగమూ, ఇంటిదగ్గర భార్యా, పిల్లలే కాలక్షేపం. అర్జునరావుకు భార్యాపిల్లలతో అట్టే నిమిత్తంలేదు. ఇంట్లోంచి వెళితే మళ్ళీ ఎన్నిరోజులకర్వాత ఇంటికొస్తాడో భార్యాపిల్లలకు తెలియదు. ఏ పట్టణంలో గుర్రాలు పరుగెడుతూంటే అక్కడకు పోతాడు. ఎక్కడ పెద్ద స్టేక్‌లో పేకాట నడుస్తూంటే అక్కడ వుంటాడు. మద్రాసు, హైదరాబాద్, బెంగుళూరు, బొంబాయి, కలకత్తాలమధ్య విమానాలమీద తిరుగుతూంటాడు. ఒక్కోసారి నెలరోజులగ్గానీ పెళ్ళానికి మొహం చూపెట్టడు.

వెంకటనారాయణ స్కూలుటీచరు. అతని సంపాదన కుటుంబఖర్చులకే సరిపోతుంది. నెలకు నూటయాభై చొప్పున మిగిల్చి బ్యాంకులో డిపాజిట్ చేస్తాడు- అతి కష్టంమీద. అతని కోర్కెలు పరిమితమైనవి; అతని బ్రతుకుతీరు సామాన్యమైంది; అతను సగటుమనిషి.

అర్జునరావు అరిస్టోక్రాటిక్ లైఫ్‌కు అలవాటుపడ్డాడు. కారుంది. డబ్బులెప్పుడూ బ్రీఫ్‌కేసులో వేలల్లో వుంటాయి. స్కాచ్‌విస్కీ, త్రీఫైవ్స్ సిగిరెట్లూ, ప్లేన్స్‌లో ప్రయాణాలు, ఫైవ్‌స్టార్స్ హోటళ్ళలో మకాం, అందమైన ఆడవాళ్ళతో అనుభవాలు - అంతా సులభంగా లభించే సొమ్ముతో భూతలస్వర్గం. రియల్ ఎస్టేట్సు ఎన్నో ఏర్పాటుచేసుకున్నాడు. ఎప్పుడూ హడావుడిగా వుంటాడు. ప్రపంచాన్ని కొనేద్దామన్నంత ఉబలాటమైన కోర్కెతో చిరాగ్గా వుంటాడు. తల్లిదండ్రులు చనిపోయినా, స్వగ్రామానికి వచ్చే తీరిక అతనికి లేకపోయింది. పెద్దకర్మల సమయానిక్కూడా అర్జునరావు రాకపోయేసరికి వెంకటనారాయణ ఎంతో బాధపడ్డాడు. ఒక బస్సుయాక్సిడెంట్‌లో తలిదండ్రులిద్దరూ చనిపోయారు. శవాన్ని తానే స్వీకరించి, దహనసంస్కారాలు చేయించాడు వెంకటనారాయణ. అన్నయ్య ఎక్కడున్నాడో జాడలేదు.

అట్లాంటిది ఒకరోజు వార్తాపత్రికలో అర్జునరావు ఫోటోచూసి దిగ్భ్రాంతి చెందాడు వెంకటనారాయణ. బంగారు బిస్కెట్ల స్మగ్లింగ్ వ్యాపారంలో అర్జున

రావు పట్టుబడ్డాడట. అతన్ని అరెస్టుచేసి జైల్లో వుంచారట. అతని వ్యవహారాల్ని అక్రమంగా సంపాదించిన ఆస్తుల్ని దర్యాప్తు చేస్తున్నారట. అతన్నిగురించి పేపరులో ఎన్నో వ్రాశారు.

"మీ అన్నగార్ని జైలునుంచి విడిపించడానికి మీరేమైనా చేయకూడదూ!" అంది వెంకటనారాయణ భార్య ఆదుర్దాగా.

"నేనా? నేను బడిపంతుల్ని. జీతంరాళ్ళకోసం నెలంతా శ్రమించి బ్రతికే వాణ్ని. వాడు ఆకాశంఎత్తుకు ఎదిగినవాడు. నేలమీద ఉన్నవాడు నింగికేసి చూడాల్సిందే గాని, నిచ్చెనమెట్లు ఎక్కగలడా? నీ పిచ్చి కాకపోతే, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నడిచినవాణ్ని నేను విడిపించగలనా? అంతటి పలుకుబడి నాకెక్కడిది!" అన్నాడు వెంకటనారాయణ అశక్తతను తెలియజేస్తూ.

*ఇతర్లను దోచుకుంటేనే తప్పు - తాను జీవించటానికి మనిషి శ్రమపడాలి.*


